క్లుప్తంగా

ఉత్పత్తి కేంద్రాన్ని పునరుద్ధరించాలి



అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నంలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని పునరుద్ధరించాలని మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొరెంకల నర్సింహ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకన్న, నర్సింహ, రామచంద్రయ్యలు మాట్లాడుతూ.. ఉత్పత్తి కేంద్రాన్ని అన్యాయంగా కూల్చివేశారన్నారు. ఉచిత చేపపిల్లలకు బదులు ఖాతాల్లో నదు జమా చేయాలని కోరారు. 50 సంవత్సరాలు నిండిన మత్స్యకారులకు వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాలన్నారు. చెరువులు, కుంటలకు శాటిలైట్ ద్వారా సర్వే నిర్వహించి, హద్దు రాళ్ల ఏర్పాటు చేయాల పేర్కొన్నారు. జంగయ్య, నరేష్ పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి నిధులు కేటాయించండి



ఎమ్మెల్యే రంగారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కుర్మలు

ఇబ్రహీంపట్నం రూరల్: కుర్మ యాదవ భవన నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని ఆ సంఘం ఎల్మినేడు గ్రామ నూతన కమిటీ సభ్యులు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కోరారు. సోమవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయించాలన్నారు. కార్యవర్గ అధ్యక్షుడు మహేందర్, పెద్దకుర్మ చంద్రయ్య, బీరప్ప, ఉపాధ్యక్షుడు మహేందర్, కోశాధికారి రాజు, కార్యదర్శి సల్తాని బాష, జంగయ్య, బాలరాజ్, నిట్టు బాష, రవి, జిల్లా కార్యదర్శి శేఖర్‌రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభిస్తున్న లయన్ సభ్యులు, ఆర్టీసీ సిబ్బంది

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు నిత్యం 700 లీటర్ల తాగునీటిని చలివేంద్రం ద్వారా పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆర్టీసీ డీఎం వెంకటనర్సప్ప, అసిస్టెంట్ మేనేజర్ రాజేశ్, లయన్ క్లబ్ ప్రెసిడెంట్ సిహెచ్ నర్సింహ, సెక్రటరీ పి.బాలరాజ్, కోశాధికారి భీమ్‌రావు, సభ్యులు మహేశ్‌గౌడ్, వెంకటేశ్, మల్లేశ్ యాదవ్, సురేష్, జగన్, కేవీ రమేష్‌రాజు, మహేశ్, సుధాకర్, రవికుమార్, ఆర్టీసీ సిబ్బంది దుశ్శాసన, నర్సింహ, సదానందం, ఆంజనేయులు పాల్గొన్నారు.

రాములుకు పరామర్శ



రాములుతో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు, చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండ్లి రాములును సోమవారం ఆమనగల్లు పట్టణంలో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుమల కృష్ణారెడ్డి పరామర్శించారు. రాములు మాతృమూర్తి జంగమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్ అలీ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మానయ్య, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కాలె మల్లయ్య, కుమార్‌గౌడ్, కండె సాయి, శ్రీనునాయక్, రాంజ్య, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కృషి ఫలితంగానే విజయవంతం

తలకొండపల్లి: తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని మరో మారు చాటి చెప్పే విధంగా బీఆర్ఎస్ వజ్రోత్సవ సభ విజయవంతమైందని మిషన్ భగీరథ రాష్ట్ర వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ సభ అయినా జయప్రదం కావాలంటే పార్టీ శ్రేణులే ప్రధానమని పేర్కొన్నారు.

సన్న బియ్యం సక్సెస్

ప్రభుత్వం కొత్తగా అమలు చేసిన సన్న బియ్యం పథకాన్ని ప్రజలు స్వాగతించారు. దొడ్డు బియ్యం సరఫరాతో గతంలో ఎన్నడూ రేషన్ దుకాణం గడప తొక్కని వారు సైతం సన్నాలు తీసుకునేందుకు పోటీ పడ్డారు. భోజనం బాగుందంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కానీ.. ఈ బియ్యం పంపిణీ ఇక మీదట ఇలాగే కొనసాగుతుందా? లేదా అని పలువురు అనుమానం వ్యక్తంచేస్తున్నారు.



ఇబ్రహీంపట్నంలోని ఓ రేషన్ షాపులో బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు(ఫైల్)

తొలి మాసంలో ప్రజల నుంచి విశేష స్పందన
- 99.5 శాతం రేషన్ తీసుకెళ్లిన లబ్ధిదారులు
- చాలా బాగున్నాయంటూ కితాబు
- ప్రతినెల ఇవ్వాలంటూ వినతి
- బ్లాక్‌లో విక్రయాలు లేనట్లే!

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన సన్న బియ్యం పథకానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మొదటి నెల ఏప్రిల్‌లో రేషన్ దుకాణాల ఎదుట బారులు తీరారు. బియ్యం ఉంటాయో, అయిపోతాయోనన్న ఆతృతతో మొదటి వారంలో రేషన్ తీసుకునేందుకు పోటీపడ్డారు. దీంతో రేషన్ డీలర్లు ఇబ్బంది పడ్డారు. స్టాక్ ఉందని, ప్రతి కార్డుదారుడికి అందుతాయని అధికారులు, రేషన్ డీలర్లు నచ్చచెప్పడంతో కొంత మేర క్రౌడ్ తగ్గింది.

940 మెట్రిక్ టన్నుల పంపిణీ

ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో ఈ నెలలో 940 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని స్టాక్ పాయింట్ నుంచి రేషన్ షాపులకు తరలించారు. ఇబ్రహీంపట్నం మండలంలో 18,941 ఆహార భద్రత కార్డులకు 37 దుకాణాలు, యాచారం మండలంలో 13,733 కార్డులకు 26, మంచాలలో 12,122 కార్డులకు 26 దుకాణాలు ఉన్నాయి. ఈ మూడు మండలాల్లో 89 షాపులకు గాను 920 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా రాజధాని హైదరాబాద్ జిల్లాలో దొడ్డు బియాన్ని పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో ఆ జిల్లాకు చెందిన పలువురు అక్కడ దొడ్డు బియ్యం తీసుకోకుండా.. సమీపంలోని ఈ డివిజన్ పరిధి నిత్యవసరా సరకుల పంపిణీ దుకాణాల నుంచి సన్నాలను తీసుకున్నారు. దీంతో అదనంగా (పోర్టబిలిటీ ప్రకారం) మరో 20 టన్నుల బియ్యం అవసరమయ్యాయి.

మిగిలింది రెండు టన్నులు

సన్నాల పంపిణీతో రేషన్ దుకాణాలకు లబ్ధిదారులు బారులు తీరారు. వదిలేదేదన్నట్లు తీసుకెళ్లారు. ఈ మూడు మండలాల పరిధిలో కేవలం 2 టన్నుల సన్నాలు మాత్రమే మిగిలాయి. ఇప్పటి వరకు పంపిణీ చేసిన దొడ్డు బియ్యం.. ప్రతి నెల 100 టన్నుల మేర రేషన్ దుకాణాల్లో మిగిలేది. ఆ బియ్యాన్ని తీసుకెళ్లిన వారిలో 40 శాతం మంది బ్లాక్‌లో విక్రయించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితిల్లో మార్పు కనబడుతోంది. ఏప్రిల్ నెలలో బ్లాక్‌లో సన్నబియ్యం విక్రయించిన దాఖలాలు లేకపోవడమే ఇందుకు నిదర్శనం.

లబ్ధిదారులకు ఆదా

ప్రతి నెల సన్న బియ్యం చౌక ధరల దుకాణాల్లో ఇస్తారో లేదోనన్న బెంగ లబ్ధిదారులను వెంటాడుతోంది. ఒకరికి(యూనిట్) ఆరు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తారు. ఒక కుటుంబంలో ఐదుగురు సభ్యులు ఉంటే 30 కిలోల బియ్యం వస్తాయి. దీంతో ఆ పేద కుటుంబానికి నెలకు రూ.1500 మేర ఆదా అవుతోంది. ప్రభుత్వం.. కేవలం మూడు నాలుగు నెలలు మాత్రమే ఈ బియ్యాన్ని ఇచ్చి, చేతులు దులుపుకొంటుందన్న చర్చ లబ్ధిదారుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఏది ఏమైనా మొదటి నెల సన్న బియ్యం పంపిణీ సాఫీగా సాగింది. ప్రజల అనుమానం, వస్తున్న ఆరోపణల నేపథ్యంలో రానున్న రోజుల్లో ఈ పంపిణీ ఎలా ఉంటుందో వేచిచూడాల్సిందే.

భోజనం బాగుంది



సన్న బియ్యం భోజనం బాగుంది. బియ్యం మరింత మక్కిన తర్వాత వండితే ఇంకా బాగుంటుంది. బియ్యంలో 10 శాతం లోపు నూక ఉంది. అది ఏమంత పెద్ద సమస్య కాదు. ఈ బియ్యంపంపిణీ మాలాంటి పేద, మధ్య తరగతి వారికి ఎంతో ఉపయోగకరం. ఆర్థికంగా వెసులుబాటు.

– శ్రీలత, గృహిణి, ఇబ్రహీంపట్నం

మాలాంటి వారికి మేలు



సన్న బియ్యం బువ్వ బాగుంది. ప్రతి నెల ఇవ్వాలి. మా కుటుంబంలో ఆరుగురు సభ్యులు ఉన్నారు. వారం దరికీ బియ్యం వచ్చాయి. సన్న బియ్యం భోజనానికి నోచుకోని మాలాంటి వారికి ఇది ఎంతగానో మేలు చేసింది. పథకాన్ని ఇలా కొనసాగించాలి.

– మొలుగు యాదమ్మ, రాయపోల్ గ్రామం

అదనంగా మరో 20 టన్నులు



ప్రతి నెల మాదిరిగానే 920 మెట్రిక్ టన్నులు సన్నాలను రేషన్ షాపులకు సరఫరా చేశాం. పోర్టబిలిటీ ప్రకారం మరో 20 టన్నులు పంపించాం. దొడ్డు బియ్యం పంపిణీ జరిగినప్పుడు 100 టన్నుల మేర ప్రతినెల మిగిలేది. ఇప్పుడు కేవలం 2 టన్నుల సన్న బియ్యం మాత్రమే మిగిలాయి. సుమారు 95.5 శాతం సన్నాలను లబ్ధిదారులు తీసుకెళ్లారు. మే కోటాను రేషన్ షాపులకు తరలిస్తున్నాం.

– జ్యోతి, స్టాక్ పాయింట్ ఇన్‌చార్జి, ఇబ్రహీంపట్నం

కంకర పోశారు.. వదిలేశారు



నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

- రెండేళ్లుగా కచ్చారోడ్డుతో కష్టాలు
- తండావాసుల ఆందోళన

కడ్తాల్: 'గుర్లకుంట తండా బీటీరోడ్డు పనులు ప్రారంభించి రెండేళ్లు పూర్తయింది. నేటికీ పూర్తి కాలేదు. కంకర పోసి వదిలేశారు. ఈ కచ్చారోడ్డుపై ప్రయాణం చేయలేక పోతున్నాం. ప్రమాదాల బారిన పడుతున్నాం. రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలి' అని గిరిజనులు డిమాండ్ చేశారు. సోమవారం కడ్తాల్– గుర్లకుంటతండా రహదారిపై గిరిజనులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా రవాణాను దృష్టిలో ఉంచుకుని, 2023 ఏడాది జనవరిలో నాటి ప్రజాప్రతినిధులు రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం పనులు ప్రారంభించిన గుత్తేదారు.. అసంపూర్తిగా వదిలేశారు. దీంతో రోడ్డు కష్టాలు ఎప్పటిలాగే ఉన్నాయని వాపోయారు. ఇదే విషయమై రెండేళ్లుగా నాయకులు, సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కంకర పోసి వదిలివేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామన్నారు. నాయకులు శంకర్‌నాయక్, తండా వాసులు పాల్గొన్నారు.

నేడు భూభారతి అవగాహన సదస్సు

కడ్తాల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెచ్చిన నూతన చట్టం భూభారతిపై మంగళవారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో అవగాహన సమావేశం నిర్వహించనున్నామని తహసీల్దార్ ముంతాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి హాజరుకానున్నారని పేర్కొన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.


తలకొండపల్లిలో..

తలకొండపల్లి: మండల కేంద్రంలోని దేవకి గార్డెన్‌లో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు భూ భారతి పోర్టల్‌పై అవగాహన సదస్సు నిర్వహించనున్నామని తహసీల్దార్ నాగార్జున సోమవారం తెలిపారు. కార్యక్రమానికి మండల పరిధి అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

ప్రజావాణికి స్పందన కరువు

కార్యక్రమానికి హాజరైన ఏఓ

ఇబ్రహీంపట్నం: డివిజన్ స్థాయి ప్రజావాణికి ప్రజల నుంచి స్పందన కరువైయింది. కలెక్టర్ ఆదేశానుసారం డిసెంబర్ 23 నుంచి ప్రజావాణి కార్యక్రమాన్ని డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇబ్రహీంపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనికి ఆర్డీఓ లేదా ఆ కార్యాలయ ఏఓ హాజరౌతుంటారు. మొదట్లో ప్రతి వారం 15 నుంచి 22 దరఖాస్తుల వరకు వచ్చేవి. ఇటీవల కాలంలో ఐదారు దరఖాస్తులకంటే ఎక్కువగా రాలేదు. ఇదిలా ఉండగా.. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఒక్క ఫిర్యాదు అందలేదని ఏఓ నర్సయ్య పేర్కొన్నారు. కాగా.. ఇలా ఎలాంటి దరఖాస్తులు అందకపోవటాన్ని పరిశీలిస్తే, ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదనే సందేహం కలుగుతోంది. ఏది ఏమైనప్పటికీ.. ప్రజావాణికి ప్రజల నుంచి రోజురోజుకు ఆదరణ తగ్గుతోందని స్పష్టమౌతుంది.



ఏఓ నర్సయ్య

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచాల: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని కిసాన్ మంచాల మండల అధ్యక్షుడు కావలి బుగ్గరాములు అన్నారు. మండల పరిధి ఆరుట్ల గ్రామానికి చెందిన బోద్రమోని మల్లయ్య, చీదేడ్ వాసి సంగం మహేశ్ ఆరోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు కోగా.. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో మల్లయ్యకు రూ.60 వేలు, మహేశ్‌కు రూ.45 వేలు మంజూరు అయ్యాయి. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులు సోమవారం బాధితులకు చెక్కులు అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తుని తెలిపారు. కార్యక్రమంలో ఆదిబట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, నాయకులు బాష, రమేష్, చంద్రయ్య ముదిరాజ్, సురేష్, జంగయ్య గౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాలకేంద్రంపై చర్యలకు డిమాండ్

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని ఇందిరమ్మ కాలనీలో ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన పాల కేంద్రపై చర్యలు తీసుకోవాలని ఆ కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎస్.రవీందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నివాసాల మధ్య సెంటర్‌ను ఏర్పాటు చేయడం వలన శబ్దకాలుష్యంతో పాటు, దుర్వాసన వస్తోందని వాపోయారు. వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఏడీఈకి ఫిర్యాదు..

పాల కేంద్రం నిర్వాహకుడు 32 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ శాఖ సిబ్బంది సహకారంతో మూడు కనెక్షన్లు తీసుకున్నాడని, దీంతో లో ఓల్టేజి సమస్య తలెత్తి, నిత్యం ఇబ్బందులు ఎదురవుతున్నాయని కాలనీ వాసులు ఆరోపించారు. ఈ మేరకు తుర్కయంజాల్ ఏడీఈకి ఫిర్యాదు పత్రం అందజేశారు. సమస్యను పరిష్కరించాలని కోరారు.

రాజ్యాంగాన్ని దెబ్బతీస్తున్న కేంద్రం

- ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్న బీజేపీ
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: 'కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగస్ఫూర్తిని దెబ్బతీస్తూ.. ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తోంది. రాజకీయ మనుగడ కోసం విద్వేషాలను రెచ్చగొడుతోంది' అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆరోపించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఆమనగల్లు మండలం మాలెపల్లి గ్రామంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేశారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే కసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికీ తిరుగుతూ రాజ్యాంగ విలువలను, బాపు, అంబేద్కర్ ఆశయాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడారు. మహాత్ముని స్ఫూర్తిగా అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తూ, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి యాత్రలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని వివరించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని వెల్లడించారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచులు వెంకటరమణారెడ్డి, శ్రీనయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు రాములు, నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత, తలకొండపల్లి సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, మాజీ వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, మార్కెట్ డైరెక్టర్ శ్రీశైలం, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.



మాలెపల్లి పాదయాత్రలో ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి



మేడే పోస్టర్ ఆవిష్కరిస్తున్న పంచాయతీ కార్మికులు, నాయకులు

- సీఐటీయూ మండల కన్వీనర్ బుగ్గరాములు
- ఎల్మినేడులో మేడే పోస్టర్ ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం రూరల్: పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఇచ్చి ఆదుకోవాలని సీఐటీయూ ఇబ్రహీంపట్నం మండల కన్వీనర్ సీహెచ్ బుగ్గరాములు డిమాండ్ చేశారు. మేడేను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం ఎల్మినేడులో కార్మికులు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు విజయమ్మతో కలిసి ఆయన పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రపంచ కార్మికులారా ఏకం కండి, పోరాడితే పోయేదేమి లేదు బానిస సంకెళ్లు తప్ప అనే నినాదంతో అనేక పోరాటాలు చేసి, కార్మికుల హక్కులను సాధించుకున్నామని గుర్తుచేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను కాలరాయాలని చూస్తుందని ఆరోపించారు. కార్మికుల హక్కులకు నష్టం కలిగించే 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయడంతో పాటు.. వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. మే 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోచయ్య, స్వామి, దేవయ్య, నర్సింహ, మల్లమ్మ, అండాలు, బుచ్చమ్మ, శారదమ్మ, కళమ్మ, రాములమ్మ, జంగమ్మ, సుగుణమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని, పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ప్రత్యేక కృషి చేస్తుందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన ఇప్పల అంజయ్య ఆరోగ్య సమస్యలతో నగరంలోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చులు అధికమవడంతో బాధితుడి సమస్యను డీసీసీ.. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే సహకారంతో సీఎం సహాయ నిధి నుంచి అంజయ్యకు రూ.2 లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. ఈ మేరకు సోమవారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, బీసీసెల్ మండల అధ్యక్షుడు యాదయ్య, నాయకులు మల్లేశ్‌గౌడ్, యాదగిరిరెడ్డి, రాజేశ్, షాబుద్దీన్, రవి, భానుకిరణ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

తుర్కయంజాల్: రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పురపాలక సంఘం పరిధి తొర్రూర్‌లో ఏర్పాటు చేసిన ఐకేపీ సెంటర్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్ చారి, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, రంగనాథ స్వామి ఆలయ చైర్మన్ అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఇంటి స్థలం కేటాయించాలి

- భూ సమస్యలు పరిష్కరించాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య

యాచారం: ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన బాధిత రైతులకు, ఎకరాకు 500 గజాల చొప్పున ఇంటి స్థలం కేటాయించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ సమావేశం.. మండల కార్యదర్శి నర్సింహ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫార్మాసిటీ పేరుతో పట్టాదారు, పాసుపుస్తకాల్లో ఉన్న ఎకరాలకు మొత్తం పరిహారం ఇవ్వకుండా సాగు యోగ్యమైన భూమికి మాత్రమే పరిహారం ఇచ్చి, పేద రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. భూములు కోల్పోయిన వారికి ఇంటి స్థలం ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. బీఆర్ఎస్ ధరణి పోర్టల్ తెస్తే, కాంగ్రెస్ సర్కార్ భూ భారతి తెచ్చి ఏం చేస్తుందోనని ప్రజల్లో అనుమానం ఉందని, ఏ చట్టాలు వచ్చినా రైతుల భూ సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదని విమర్శించారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు, రైతుబీమా అందజేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు బ్రహ్మయ్య, జంగయ్య, చందునాయక్, పెద్దయ్య, వినోద్‌కుమార్, జగన్, వెంకటయ్య, లాజర్, విప్లవ్‌కుమార్, బాలరాజ్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యాదయ్య